

రైతుల పక్షపాతి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 8
గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు 7



- జిల్లాలో పూర్తయిన రైతు భరోసా అభిప్రాయ సేకరణ
- సహకార శాఖ ఆధ్వర్యంలో సర్కారుకు నివేదిక సమర్పణ
- సాగు భూమికి, 10 ఎకరాల వరకే ఇవ్వాలని మెజార్టీ రైతుల అభిప్రాయం
- పలు చోట్ల కౌలు రైతులకు ఇవ్వాలని వినతులు
- నివేదికపై సర్కారు నిర్ణయమే కీలకం
- ఆశతో ఎదురుచూస్తున్న అన్నదాతలు

కొలిక్కి వచ్చేనా ?

జగిత్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ ఒక కొలిక్కి వచ్చినప్పటికీ ప్రభుత్వ నిర్ణయం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. సాగుకు పెట్టుబడి అందించే రైతు భరోసా పథకం అమలులో చేయాల్సిన మార్పులు, చేర్పులకు సంబంధించి రైతుల నుంచి అభిప్రాయ సేకరణ పూర్తయింది. విధి విధానాలను ఖరారు చేయడానికి ప్రభుత్వం మంత్రి వర్గ ఉప సంఘం, శాసన సభలో చర్చ అనంతరం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ వర్షాకాల సీజన్ పంటలకు పెట్టుబడి సాయం అందడంలో మరింత సమయం పట్టే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించాలనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ఉద్దేశం మంచిదే అయినా అర్హుల కంటే అనర్హులకే ఎక్కువ లాభం జరిగిందనే ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి.

రియల్ ఎస్టేట్ వెంచర్లు, గుట్టలు, ఇటుక బట్టీలు సాగు చేయని భూములకు సైతం రైతు బంధు అందించారు. కాగా అర్హులకు మాత్రమే పెట్టుబడి సాయాన్ని రైతు భరోసా పేరుతో అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తుంది. రైతుభరోసా సమూల మార్పులను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పథకం ఎలా ఇస్తే బాగుంటుంది. అనే దానిపై రైతుల అభిప్రాయాలను తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే గత 28వ తేదీ నుంచి ఈ నెల 4వ తేదీ వరకు జిల్లాలోని రైతు వేదికలు, సింగిల్ విండో కార్యాలయాల్లో రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించింది.

జిల్లాలో 3,110 మంది రైతుల అభిప్రాయ సేకరణ...

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల 51 సమావేశాలు నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ, సహకార శాఖ అధికారులు సంయుక్తంగా సమావేశాలు నిర్వహించి 3,110 మంది రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఇందులో అయిదు ఎకరాల్లోపు భూమికి మాత్రమే ఇవ్వాలని 1,320 మంది రైతులు చెప్పగా, పది ఎకరాల్లోపు భూమి ఉన్న వారికి ఇవ్వాలని 1,448 మంది రైతులు, 25 ఎకరాల్లోపు ఉన్న వారికి ఇవ్వాలని 134 మంది రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎంత భూమి ఉంటే అంత భూమికి ఇవ్వాలన్న రైతులు 183 మంది ఉన్నట్లుగా అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. ఇదిలా ఉండగా సాగులో ఉన్న భూమికి మాత్రమే రైతు బంధు ఇవ్వాలని 3,093 మంది రైతులు అభిప్రాయం వ్యక్తం చేయగా, వ్యవసాయేతర భూమికి సైతం ఇవ్వాలని 17 మంది రైతులు అభిప్రాయాలను వెల్లడించారు.

సర్కారు నిర్ణయమే తరువాయి..

జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి సుమారు 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయగా, ఇప్పటి వరకు సుమారు రెండు లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేశారు. కానీ ఇప్పటి వరకు రైతులకు తమ ఖాతాల్లో రైతు భరోసా వేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వానాకాలం పంట సాగు ప్రారంభమైనా ఇప్పటివరకు రైతు భరోసా ఖాతాల్లో జమ చేయలేదు. ఇప్పటి వరకు రైతుల అభిప్రాయలను మాత్రమే సేకరించిన ప్రభుత్వం ఈ వ్యవహారంపై పూర్తి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

సాగులో లేని భూముల గుర్తింపు జరుగుతుందా...

రైతులకు పెట్టుసాయం అందించాలంటే సాగులో ఉన్న భూమి, సాగులో లేని భూమి లెక్కలు తేలాల్సి ఉందని సంబంధిత వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సాగులో లేని భూములను గుర్తించాలంటే మరింత సమయం పట్టే అవకాశం ఉంటుంది. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే కానీ సాగు భూమి ఏది, సాగులో లేని భూమి ఏది, కొండలు, గుట్టలు, వెంచర్లను గుర్తించే అవకాశం ఉంటుంది. వీటిని గుర్తించాలంటే మరింత సమయం పట్టే అవకాశం ఉంది. దీన్ని బట్టి చూస్తే ఈ నెల కూడా రైతు భరోసా వచ్చే అవకాశం కనిపించడం లేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

అభిప్రాయాలను సేకరించాము : వాణి, జిల్లా వ్యవసాయ అధికారిణి



జిల్లాలో రైతుల అభిప్రాయ సేకరణ కోసం వ్యవసాయ శాఖ, సహకార శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలను రైతులతో నిర్వహించాము. సమావేశాల్లో రైతుల నుంచి వచ్చిన సలహాలను ఎప్పటికప్పుడు సహకార శాఖ అధికారుల నమోదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదికను సహకార శాఖ ద్వారా అందించారు. నివేదికపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు తరువాత అవసరమైన పనులు నిర్వహిస్తాము.

రైతుల భిన్నాభిప్రాయాలు...

ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఈ వానాకాలం నుంచి ఎకరానికి నిర్ణీత మొత్తంలో రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రైతుల సలహాలు, సూచనలు తీసుకునేందుకు జిల్లాలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. సహకారశాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాల్లో ఎక్కువ శాతం రైతుల అర్హులకు మాత్రమే ఈ పథకాన్ని అమలు చేయాలనే అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నిరుపయోగంగా ఉన్న భూములకు రైతు బంధు ఇచ్చినా, ఉపయోగం లేదని కేవలం సాగు భూములకు మాత్రమే భరోసా ఇవ్వాలని అధిక శాతం రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో పాటు చాలా మంది రైతులు పది ఎకరాలకు మాత్రమే రైతుబంధును పరిమితం చేయాలని, ఎక్కువ శాతం రైతులకు అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు అధికారులు అంటున్నారు. మరికొన్ని చోట్ల కౌలు రైతులు సైతం సమావేశాల్లో పాల్గొని కౌలు రైతులు గుర్తించి వారికి కూడా రైతు భరోసా ఇవ్వాలనే డిమాండ్ చేశారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సమావేశాల్లో రైతుల అభిప్రాయాలను అన్నింటిని క్రోడీకరించి కో-ఆపరేటివ్ శాఖ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదికలు సమర్పించారు. దీనిపై ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

ప్రతీ ఇంటిని ఆరోగ్య సిబ్బంది సందర్శించాలి

కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటిని ఆరోగ్య సిబ్బంది విధిగా సందర్శించి దోమలు పెరగడానికి ఆస్కారం ఉన్న ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్మూలించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచనలు చేశారు. మలేరియా, డెంగ్యూ, కలరా వ్యాధులపై జిల్లాస్థాయి సమన్వయ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న డెంగీ కేసులనే కాకుండా, ప్రైవేట్ ఆస్పత్రుల వివరాలను నమోదు చేస్తూ వాటి వివరాలను తెలియజేయాలని, ప్రతి వార్డులో ఫాగింగ్ చేయాలని అన్నారు అలాగే వైద్యాధికారుల పరిధిలో ఉన్న ఆశ్రమపాఠశాలలను విధిగా సందర్శించి వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ రఘువరన్, జిల్లా వైద్యాధికారి సంయొద్దీన్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి కాంట్రాక్టర్ల వినతి



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కంట్రాక్టర్లు

జగిత్యాల టౌన్, జూలై 8 : జగిత్యాల మున్సిపల్ పరిధిలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేసి సంవత్సరం గడిచినా బిల్లులు రావడంలేదని తక్షణ మే ఇప్పించాలని కోరుతూ జగిత్యాల కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్ చైర్ పర్సన్‌తో పాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం కాంట్రా క్టర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంగిలి క్రిష్ణానంద్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వడంలో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సూమారు రూ. 6 కోట్లకుపైగా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు అప్పుల పాలు కావడంతో పాటు తీవ్ర మనోవేదనకు గురువతున్నామన్నారు. పాత బిల్లులు చెల్లించకుండానే కొత్త పనులు చేపట్టాలని అధికారులు నోటీసులు పంపడంతో పాటు బ్లాక్ లిస్టులో పెడుతామంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లు రమేష్‌రావు, చంద్ర శేఖర్, రాంమూర్తి, కిషోర్ కుమార్, వెంకటేశ్వర్ రావు సుకుమార్, రాజిరెడ్డి, సుల్తానోద్దీన్, నాగయ్య, మల్లేశం, వెంకటి ఉన్నారు.

వీఆర్‌వోల సమస్యలను పరిష్కరించేలా కృషి

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌వోలు

జగిత్యాల టౌన్, జూలై 8 : వీఆర్‌వోల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా వీఆర్‌వోల జాయింట్ యాక్షన్ కమిటీ కార్యవర్గ సభ్యులు సోమవారం ఎమ్మెల్సీతో పాటు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. 121 జీవో ప్రకారం అశాస్త్రీయంగా వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేశారని, ఇలాంటి జీవోను రద్దుచేసి వీఆర్‌వో వ్యవస్థను యదావిధిగా గతంలో మాదిరిగా తీసుకరావాలని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు తమ బాధలను వీఆర్‌వోల సంఘం నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర జేఏసీ సభ్యుడు సంజీవ్ ఉన్నారు.

జడ్పీ మాజీ చైర్‌పర్సన్‌కు సన్మానం

జగిత్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పదవీ కాలం పూర్తి చేసు కున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్‌ను సోమవారం పలువురు ప్రజ్ఞా మున్నూరు కాపు యువజన సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో పోచమ్మ వాడ ప్రజ్ఞ మున్నూరు కాపు యువజన సంఘం నాయకులు కొక్కు గంగాధర్, ముసిపట్ల సత్యనారాయణ, జంగిలి రవి కుమార్, కొక్కు రాములు, తిరుపురం రాంచందర్, రమేశ్, మహేశ్, ప్రవీణ్ కుమార్, పుప్పాల రాజిరెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్ల ఆవిష్కరణ

జగిత్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో కలెక్టర్ సత్య ప్రసాద్ సోమవారం ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా కొత్త ఆవిష్కరణ చేసిన వ్యక్తులు తెలంగాణ ఇన్నోవేషన్ సెల్‌కు అన్ని వివరాలను టీఎస్‌ఐసీ వాట్సాప్ నంబర్ 9100678543కు పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకల్‌బాడీస్ అదనపు కలెక్టర్ రఘువ రన్, ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్, శ్రీనివాస్, ఈ డిస్ట్రిక్ మేనేజర్ మమత, ఇన్నోవేటర్ కో ఆర్డినేటర్ జలందర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

జగిత్యాల టౌన్, జూలై 8 : అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండు నుంచి పాత బస్టాండ్ వరకు ఉన్న యావర్ రోడ్‌లో నిబంధనలకు విరుద్దంగా ఏర్పాటు చేసిన అక్రమ కట్టడాలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. రహదారుల పైకి వచ్చి వ్యాపారం చేయవద్దని కోరారు. పండ్ల వ్యాపారు లతో పాటు తోపుడు బండ్ల నిర్వాహకులు మున్సిపల్ స్థలాల్లో నిబంధనల మేరకు క్రయ, విక్రయాలు జరుపాలన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న రహదారుల ప్రక్కన ఉన్న స్థలాలను ఆక్రమించుకని అద్దెలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీనివాస్, తేజస్విని తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

టౌన్ సీఐ వేణు గోపాల్



మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

జగిత్యాల టౌన్, జూలై 8 : ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వర్తక సంఘ భవనంలో సోమవారం వ్యాపారులకు ట్రాఫిక్ నింబంధనలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దుకాణాల సముదాయాల ఎదుట, రహదారులపై వాహనాలు పార్కింగ్ చేయరాదన్నారు. రహదారులపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, ఐరన్ బోర్డులను తక్షణమే తీసివేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వ్యాపారాలు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వర్తక సంఘం అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్, ఆర్ఎస్సై మల్లేశ్ ఉన్నారు.

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



ప్రజావాణిలో కలెక్టర్‌కు గోడు వెల్లబోసుకుంటున్న దరఖాస్తుదారులు

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 58 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరుత్సాహానికి గురికావ డంతో పాటు పలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రఘువరన్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధు సుదన్, ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పనితీరుపై పర్యవేక్షణ జరగాలి

జిల్లాలో వివిధ శాఖల ఉద్యోగుల పనితీరుపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర వైద్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సక్రమంగా హాజరుకావడం లేదన్న ఆరోపణలున్నాయని, సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, పంచాయతీలలో అక్రమ నిర్మాణాలపై ఆరోపణలు అధికంగా వస్తున్నాయని, నిర్మాణాలకు అనుమతిని సైతం ఇష్టారీతిగా ఇస్తున్నారన్న అభిప్రాయాలున్నాయని మండి పడ్డారు. కోరుట్ల, రాయికల్ పట్టణంలో పలు ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్న సమాచారం ఉందని, వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగిత్యాల మున్సిపల్‌లో సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు జరుగుతున్నాయన్న వార్తలు వస్తున్నాయన్నారు. స్థానిక సంస్థల్లో రెండు, మూడేళ్ల పాటు ఒకే బాధ్యతలు నిర్వర్తించిన ఉద్యోగులను ఇతర విభాగాలకు బదిలీ చేయాలని సూచించారు. వివిధ విభాగాలకు చెందిన జిల్లా స్థాయి అధికారుల వద్ద వారివారి శాఖకు చెందిన సంపూర్ణ సమాచారం ఎప్పటికప్పుడు ఉండాలని సూచించారు. ఎటువంటి సమాచారం లేకుండా సమావేశాలకు హాజరైతే చర్యలు తప్పవన్నారు.

మానస స్కూల్‌లో ఫ్రెషర్స్ డే హంగామా

జగిత్యాల అర్బన్, జూలై 8: జగిత్యాల జిల్లా కేంద్రంలోని మానస స్కూల్ ఆఫ్ స్కూల్ ఎక్స్‌లెన్స్‌లో సోమవారం పరిచయ్-2024 పేరుతో ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, పాఠశాల ప్రిన్సిపాల్ రజితరావు మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరానికి గానూ పాఠశాలలో అడ్మిషన్ పొందిన నూతన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ప్రదర్శించిన పలు నృత్య, సాంస్కృతిక ప్రదర్శించిన పలు ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, హరిచరణ్ రావు, మౌనికరావుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు

ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, జూలై 8 : ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వ హించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ చేసే దిశగా పోలీస్ అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని వివరించారు.

నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ సేవలందిస్తా

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాలరూరల్, జూలై 8 : నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ సేవలందిస్తానని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం బావాజీపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న రేఖను దావ వసంతసురేష్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయురాలు అందించిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో ఎంఈవో గాయత్రి ,మాజీ సర్పంచ్ ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ మమతశంకర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లల బాలకృష్ణ



రిలే దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

జగిత్యాల అర్బన్, జూలై 8: అంగన్‌వాడీ వర్కర్‌లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లల బాలకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న రిలే దీక్షలకు సీపీఎం నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీ వర్కర్‌లు, ఆయాలు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 24రోజుల నిరవధిక సమ్మె చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ, ప్రతిపక్ష పార్టీలుసైతం అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఉద్యమించినా ఫలితం దక్కలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అండగా ఉంటామని హామీ ఇచ్చి నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరం అన్నారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేయడంతో పాటు, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26వేలకు పెంచాలని, పెన్షన్ నెలకు రూ. 10వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈపీఎఫ్ సౌకర్యాలకు దేశమంతటా ఒకే విధానం ఉండాలని డిమాండ్ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరణ చేయరాదని, ప్రభుత్వ రంగాల ప్రైవేటీకరణను ఆపాలని, నాలుగు లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలని, జీవో నెం 10ను వెంటనే రద్దు చేయాలని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పుప్పాల శ్రీకాంత్, వెంకటాచారి, బొర్ర శేఖర్, రఫీక్, రమేష్, చంద్రయ్య, సురేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు శారద, స్వప్న, కళావతి, గంగాజమున, భాగ్యలక్ష్మి, దేవమ్మ, రాజ్యలక్ష్మీ, ఎల్లవ్వ తదితరులున్నారు.

రాయికల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో

మినీ బ్రిడ్జి నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్


రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్, జూలై 8: రాయికల్ పట్టణంలో వివిధ గ్రామాలను అనుసంధానం చేస్తూ వెళ్తున్న రోడ్డులో నిర్మిస్తున్న మినీ బ్రిడ్జిలను నాణ్యతా ప్రమాణాలతో వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ రాయికల్ పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని సంబంధిత అధికారులను బాధ్యులుగా చేస్తూ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గత వారంలో షైతాపూర్ రోడ్డులో గల బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సు 11 కేవీ స్తంభానికి అంటుకుని ప్రమాదపుటంచుల్లో వెళ్లిందని, వెంటనే బ్రిడ్జిలను పూర్తి చేయాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి కోరుట్ల, మేడిపల్లి, వేములవాడకు సంబంధించినటువంటి రవాణా కూడా ఈ బ్రిడ్జిలపై నుంచే వెళ్తూ ఉండటంతో వచ్చే వర్షాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా వాటిల్లకుండా వెంటనే నిర్మాణాలను పూర్తి చేసి పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా విడుదల చేసి కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కురుమ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కుంబోజి రవి, బొడుగం శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు కోల శంకర్, కునారపు భూమేష్, బీసీ సెల్ అధ్యక్షుడు ఆశన్న, రామన్న, ఐటీ సెల్ అధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్, కటకం కిషోర్, బీజేవైఎం నాయకులు బుర్ర గోపి, బంటి, బూత్ అధ్యక్షుడు రామకృష్ణ, అల్లె నర్సయ్య, శేఖర్, ఎల్లాగౌడ్, రాజేంద్రప్రసాద్, కంటె భూమేష్, ఇద్దాం గంగారెడ్డి, కట్ట రాము, నర్సయ్య పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జూలై 8: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని పెగడపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన గోపగోని రాజయ్య(40) అనే గీత కార్మికుడు సోమవారం తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. రాజయ్య తలకు కాళ్లకు చేతులకు నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన రాజయ్యను కుటుంబసభ్యులు పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతోనే అభివృద్ధి

- ఇక అభివృద్ధిపైనే దృష్టిపెడదాం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు


సిరిసిల్లలో మాట్లాడుతున్న బండి సంజయ్

సిరిసిల్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు అయిపోయాయి.. ఇకపై ఒకరినొకరు తిట్టుకోవడం బంద్ చేద్దాం, విమర్శలు, ఆరోపణలు పక్కన పెట్టి అభివృద్ధిపై ఫోకస్ చేద్దామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే అభివృద్ధి జరుగుతుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం సిరిసిల్ల నియోజకవర్గంలోని సిరిసిల్ల, వీర్నపల్లి, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. సిరిసిల్లకు వచ్చిన బండి సంజయ్‌కు బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. సిరిసిల్లలో రూ. 10 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపం ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని గ్రామాలు, పట్టణాలు,


బండి సంజయ్‌ను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు

అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పక్షాన సంపూర్ణ సహకారం అందించే బాధ్యత తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. కుల సంఘాల కార్యాలయాలు నిర్మిస్తే ఆసంఘంలోని నాయకులకే ఉపయోగపడుతుందని కానీ కుల సంఘాల తరఫున కల్యాణ మండపాలు నిర్మిస్తే ఆ కులంలోని ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందని ఆలాంటి వాటికే ఎంపీ నిధులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏ కుల సంఘం అయినా ఆ కులంలోని పేదలకు సహాయ, సహకారాలు అందిస్తూ ఆదుకున్నప్పుడే కుల సంఘాలకు మనుగడ ఉంటుందన్నారు. మీలో ఒకడిగా మున్నూరు కాపు సంఘం చేపట్టే ప్రజోపయోగ పనులకు తన వంతుగా సహకారం అందిస్తానని అన్నారు.

రెండోసారి ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించడంలో సిరిసిల్ల జిల్లా ప్రజల భాగస్వామ్యం ఉందన్నారు. రెండోసారి గెలవడం వల్లనే మోదీ కేబినేట్‌లో చోటు దక్కిందన్నారు. జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. నిధులు తీసుకవచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సి పల్ ఛైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్య క్షుడు దేవయ్య, పట్టణ అధ్యక్షుడు అగ్గిరాములు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, కౌన్సిలర్ కల్లూరి రాజు, సంఘం ప్రతినిధులు శీలం రాజు, దుమాల శ్రీకాంత్, నీలి శంకర్, ఎరుకల ప్రకాష్, కుల్ల సత్తయ్య, నాయిని కిషన్, బాలయ్య, నర్సయ్య, వేణు పాల్గొన్నారు.

విద్యార్థులపై తెగిపడిన విద్యుత్ వైర్లు

- గంగాధరలోని బీసీ గురుకులంలో ఘటన
- ఇద్దరు విద్యార్థులకు విద్యుదాఘాతం
- తప్పిన ప్రమాదం


చికిత్స పొందుతున్న అశ్విత్


విద్యార్థికి అయిన గాయాలు

గంగాధర, జూలై 8: విద్యుత్ తీగలపై కోతులు ఎగరడంతో వైర్లు తెగి విద్యార్థులపై పడగా విద్యుదాఘాతంతో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. వైర్లు తెగిపడగానే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గంగాధరలోని బీసీ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి నియోజకవర్గ బీసీ గురుకుల బాలుర పాఠశాల గంగాధర బ్లాకులోని ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. సోమవారం ఉదయం తరగతులకు వెళ్లేందుకు విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. పాఠశాల బాత్ రూంల పైనుంచి గంగాధర, లక్ష్మీదేవి పల్లి ఎక్స్‌ప్రెస్ 11కేవీ విద్యుత్ లైను ఉంది. అయితే ప్రతి రోజు విద్యార్థులు తినగా మిగిలిన ఆహారం పక్కనే పడేస్తారు. పాఠశాల పక్కనే చెట్లపైనుంచి కోతులు ఆహారం కోసం వస్తుంటాయి. సోమవారం కోతులు 11 కేవీ వైర్లపై నుంచి ఆహారం కోసం వస్తున్న సమయంలో అవి తెగిపడ్డాయి. అప్పుడే కాలకృత్యాలు తీర్చుకుంటున్న ఆరో తరగతి విద్యార్థి ఎ అశ్విత్‌పై విద్యుత్ తీగపడింది. విద్యుత్ వైరు తెగిపడగానే సబ్‌స్టేషన్‌లో ఫీజు కొట్టేసి సరఫరా నిలిచి పోయింది. విద్యార్థిపై తీగపడగా పొట్టభాగంలో, కుడిచేతి పై గాయాలయ్యాయి. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న ఓ. అశ్విత్ కాళ్లపై తీగ పడటంతో స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే సిబ్బంది వీరిద్దరినీ 108లో కరీంనగర్ తరలించారు. ప్రస్తుతం ఇద్దరికి ఎలాంటి ప్రాణాపాయం లేదు. ఏ అశ్విత్ డిశ్చార్జికాగా మరో విద్యార్థిని డిశ్చార్జి చేయనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈఘటనను చూసిన మరో ఇద్దరు విద్యార్థులు స్పృహతప్పి పడిపోగా స్థానిక వైద్యశాలలో చికిత్స అందించారు.


పాఠశాల నుంచి ఉన్న 11 కేవీ విద్యుత్ లైను

నిత్య కల్యాణానికి మంగళసూత్రాలు బహూకరణ

ధర్మపురి, జూలై 8: ధర్మపురి క్షేత్రం లోని శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో జరిగే నిత్యకల్యాణానికి హైద్రాబాద్ వాస్తవ్యులు శృత ప్రీతి, సునీత, సత్యవతి, సరిత, సరళ, రెండు జతల బంగారు సూత్రాలను సోమవారం సమర్పించారు. సుమారు నాలుగు లక్షల విలువ గల మంగళసూత్రాలు ప్రతి నిత్యం స్వామివారి కల్యాణం సమయంలో అలంకరణ కోసం కార్యాలయంలో ఈవో సంకటాల శ్రీనివాస్‌కు అందించారు. వారందరిని ఆలయ పక్షాన ఈ ఓ శ్రీనివాస్ స్వామి శేషవస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు.


ఈవో శ్రీనివాస్‌కు మంగళసూత్రాలు అందజేస్తున్న దాతలు

మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు హుస్సేన్ అరెస్ట్



మహ్మద్ హుస్సేన్

జమ్మికుంట, జూలై 8: కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు, సికాసా వ్యవస్థాపక కమిటీ సభ్యుడు మహ్మద్ హుస్సేన్ అలియాస్ సుధాకర్, అలియాస్ రమాకాంత్‌ను సోమవారం తెల్లవారు జామున పోలీస్‌లు అరెస్ట్ చేశారు. 1977లో మహ్మద్ హుస్సేన్ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2009లో జార్ఖండ్ రాష్ట్రంలో పోలీస్‌లు ఆయనను అరెస్ట్ చేశారు. జైలు జీవితం అనుభవించిన అనంతరం 2011లో జమ్మికుంటకు వచ్చారు. అప్పటి నుంచి హుస్సేన్ ఇక్కడే ఓ ఇంటిలో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఆయన సోదరుడి కుమారుడు రబ్బాని ఇంటి పక్కనే ఉంటూ అలానాపాలన చూసుకుంటున్నాడు. హుస్సేన్ కొంత కాలంగా బీపీ, షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల కంటి సమస్య తలెత్తడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కంటికి ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు బంధువులు తెలిపారు. సోమవారం తెల్లవారు జామున పోలీస్‌లు సివిల్ డ్రెస్‌ల్లో మహ్మద్ హుస్సేన్ ఉంటున్న ఇంటికి చేరుకున్నారు. నిద్రపోతున్న మహ్మద్ హుస్సేన్‌ను లేపి వెంట తీసుకువెళ్లారు. ఈ సమయంలో పక్క ఇంట్లోనే ఉంటున్న హుస్సేన్ సోదరుడి కుమారుడు రబ్బాని వచ్చి ఎవరు మీరు, ఏం కావాలి, ఎక్కడికి తీసుకు వెళ్తున్నారంటూ ప్రశ్నించినా సమాధానం చెప్పకుండానే తీసుకు వెళ్లారని అతడు తెలిపాడు. హుస్సేన్ వద్ద ఉదయం 11గంటల సమయంలో రబ్బాని ఫోన్‌కు పోలీసుల నుంచి ఫోన్ వచ్చింది. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుల్‌ను మాట్లాడుతున్నానని, హుస్సేన్‌ను ఓ పాత కేసులో విచారణ నిమిత్తం తాము తీసుకు వచ్చామని, మంచిర్యాల కోర్టులో హాజరుపరుస్తామని చెప్పి ఫోన్ కట్ చేశారు. దీంతో రబ్బాని కుటుంబ సభ్యులు వెంటనే రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తెలిసింది. 1971లో హుస్సేన్- జిలానిబేగంకు వివాహం జరిగింది. ఆమె 1992లో ఉద్యమంలోకి వెళ్లింది. 1996లో గోదావరిఖనిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆమెమృతి చెందింది.



హుస్సేన్ అరెస్టును చూపెడుతున్న ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్, జూలై 8: మావోయిస్టు కీలక నేత మహ్మద్ హుస్సేన్ అలియాస్ సుధాకర్ అలియాస్ రమాకాంత్‌ను అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. సోమవారం రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రెండు నెలలుగా మావోయిస్టు, సికాస భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో మందమర్రి, రామకృష్ణాపూర్ పరిసర ప్రాంతాలలో తిరుగుతున్నాడనే సమాచారంతో సీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఏసీపీ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. సోమవారం రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ ఆర్కే-1ఏ గని సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా పోలీసులను చూసి

వివరాలు వెల్లడించిన రామకృష్ణాపూర్ పోలీసులు

పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా హుస్సేన్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో విచారించగా మావోయిస్టు కరపత్రాలు, డాక్యుమెంట్లు, వాల్ పోస్టర్లు, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మందమర్రికి చెందిన హుస్సేన్ ప్రస్తుతం జమ్మికుంట ప్రాంతంలో నివాసం ఉంటున్నాడని, 1978 నుంచి 1981 వరకు సింగరేణి కార్మికుడిగా కెకె-2 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేశాడని తెలిపారు. ఈ సందర్భంగా మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన

ప్రజాకవి, రచయిత మహ్మద్ హుస్సేన్ అరెస్టు అప్రజాస్వామికమని వెంటనే పోలీసులు ఆయనను విడుదల చేయాలంటూ సోమవారం రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్ వద్ద పౌర హక్కుల సంఘం, విప్లవ రచయితల, ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకులు నిరసన చేపట్టారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, ఉపాధ్యక్షులు సుచరిత, నార వినోద్, సహాయ కార్యదర్శి వినోద్, బోడ్డు రవి, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్ కన్వీనర్ బాలసాని రాజమ్మ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి కన్వీనర్ గాండ్ల మల్లేశం తదితరులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

తిమ్మాపూర్, జూలై8: మండలంలోని రేణికుంట గ్రామం రాజీవ్ రహదారిపై గల టోల్‌ప్లాజా వద్ద పీడీఎస్ బియ్యం తరలిస్తున్న రెండు లారీలను సివిల్ సప్లయ్ అధికారులు, ఎల్ఎండి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి జిల్లా దేవునిపల్లికి చెందిన గురువయ్య అనే వ్యక్తి పలువురి వద్ద నుంచి తక్కువ ధరకు పిడిఎస్ బియ్యం కొనుగోలు చేసి ఆ బియ్యంను పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నరసింహులపేట గ్రామ శివారులో డంపు చేశాడు. డంపు చేసిన బియ్యం రెండు లారీల్లో లోడ్ చేసి సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కి తరలిస్తుండగా ఖచ్చితమైన సమాచారంతో రేణికుంట టోల్ ప్లాజా వద్ద సివిల్ సప్లయ్ ఆధికారులు, ఎల్ఎండి పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. లారీల్లో 452.30 క్వింటాళ్లు, 11,30,750రూపాయల విలువల గల బియ్యం పట్టుకున్నారు. బియ్యంను కరీంనగర్‌లోని యంఎల్ఎస్ పాయింట్ గోడౌన్‌కు తరలించారు. లారీ డ్రైవర్లను అదుపులోకి తీసుకొని, బియ్యాన్ని తరలిస్తున్న గురువయ్య, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు. లారీలను పట్టుకున్న వారిలో తిమ్మాపూర్ సిఐ కె.స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట రూరల్, జూలై 8: జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ గ్రామంలో ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 38.90క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఆదివారం అర్ధరాత్రి పోలీస్‌లు పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవీందర్ తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు

మానకొండూర్ : మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. రేషన్ డీలర్ సురేష్ దుకాణంలో పౌరసరఫరాలు, విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేపట్టారు. దుకాణంలో 33.71 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. డీలర్ సురేష్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన డీలర్ లక్ష్మీనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 3,414 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,414 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 11.965 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.975 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

రైలు ఢీకొని ఒకరి మృతి

కోరుట్ల, జూలై 8 : కోరుట్ల పట్టణానికి చెందిన చిట్యాల నరేశ్ (32) అనే వ్యక్తిని సోమవారం రైలు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఎస్సై కథనం ప్రకారం... మతిస్థిమితం లేని నరేశ్ ఇంటి నుంచి వెళ్లగా చిన్నమెట్‌పల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నిజామాబాద్ రైల్వే ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు

భర్త చేతిలో భార్య హత్య

● అనంతరం తానూ ఆత్మహత్యాయత్నం

మేడిపల్లి, జులై 8: అనుమానం పెనుభూతంగా మారి కట్టుకున్న భార్యను కడతేర్చాడు. మండలంలోని తొంబర్రావుపేట గ్రామానికి చెందిన రాయంచు లింగంకు కట్లకుంట గ్రామానికి చెందిన లక్ష్మి (45)తో 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాలు వీరి దాంపత్యం అన్యోన్యంగా సాగింది. ఇంతలోనే లక్ష్మి గ్రామంలోనే ఒకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందని భర్త లింగంకు అనుమానం కలిగింది. దాంతో వీరి మధ్య తరచూ గొడవలు మొదలయ్యాయి. లింగం ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు, సంవత్సరం క్రితం సెలవుపై వచ్చి కూతురికి వివాహం చేశాడు. అనంతరం లింగం అతని కొడుకు గల్ఫ్ వెళ్లారు. ఉన్నట్టుండి లింగం హటాత్తుగా ఆదివారం సాయంత్రం గల్ఫ్ నుంచి ఇంటికి వచ్చాడు. రాత్రి బెడ్‌రూంలో నిద్రిస్తున్న తన భార్య మెడకు తాడు కట్టి ఉరివేసి ఇనుప పారతో కొట్టి హత్య చేశాడు. అనంతరం లింగం అక్కడే ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఉదయాన్నే ఇరుగుపొరుగు వారు గమనించి లింగంను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై శ్యామ్‌రాజ్ దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జూలై 8: కరీంనగర్ జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న వ్యాపారి కట్కూరి రాజు(47) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం కట్కూరి రాజు కరీంనగర్ మండలం వల్లంపహాడ్‌లో ఒక ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజులాగే ఈ నెల 7న ఉదయం 10 గంటలకు దుకాణానికి వెళ్లి సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ తరువాత రాత్రి 7 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. సోమవారం ఉదయం రాజు కుటుంబ సభ్యులు రెండో టౌన్ పోలీసులకు సమాచారం అందించగా సాంకేతికతతో రాజు ఉన్న లోకేషన్‌కు వెళ్లి చూడగా అల్కాపురికాలనీలోని ఒక ఎండిపోయిన కుంట దగ్గర పురుగుల మందు తాగి చనిపోయి కనిపించాడు. మెహర్‌నగర్‌లో ఒక అపార్ట్‌మెంట్‌లో రాజు ఒక ఒక ఫ్లాట్‌ను కొనుగోలు చేయగా నిర్మాణం తీవ్ర జాప్యం అవుతున్నందున తరచుగా మనస్థాపం చెందేవాడని, ఈ కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య కట్కూరి విజయ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఒకరి అదృశ్యంపై కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 8: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి న్యూమారేడుపాకలో దొంతుల సతీష్ అనే వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యానికి బానిసైన సతీష్ తరచూ భార్య శిరీషతో గొడవ పడేవాడు, భర్త ప్రవర్తనతో విసుగు చెందిన శిరీష తన తల్లి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఆదివారం మద్యం సేవించి ఇంటికి రాగా అతిగా తాగుతుండడం, భార్యతో గొడవ పడిన విషయమై సతీష్‌ను తండ్రి మందలించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తండ్రితో గొడవ పడిన సతీష్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు రాకపోవడంతో కుటుంబీకులు వెతికినా సతీష్ ఆచూకీ లభించలేదు. భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కమాన్‌పూర్, జూలై 8: మండలంలోని రొంపికుంటకు చెందిన ఓ యువకుడు మనస్తాపానికి గురై సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొయ్యడ కుమార్(28) అనే యువకుడికి చెందిన గొర్లు అదే గ్రామానికి చెందిన పులిపాక బొంద్యాలు అనే వ్యక్తి తోటలోని బబ్బెర చెట్లు మేశాయి. ఈ మేరకు సోమవారం ఉదయం పంచాయితీకి రావాలని అదే గ్రామానికి చెందిన కటకం రవీందర్ పిలిచారు. కానీ కొయ్యడ కుమార్ సోమవారం ఉదయం తన పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలోనే కొయ్యడ కుమార్ ఇంటికి అదే గ్రామానికి చెందిన వీఆర్ఏ వెళ్లి పంచాయితీకి రావాలని చెప్పగా కుమార్ భార్య రేణుక తన భర్త పొలానికి వెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే వీఆర్ఏ కొయ్యడ కుమార్ పొలానికి వెళ్లి చూసేసరికి మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పంచాయితీకి రాకపోతే కేసు పెడుతారన్న భయంతో మనస్తాపానికి గురై తన భర్త ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్ప డినట్లు మృతుడు కుమార్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

● మృతుడి కళ్లు సజీవం

గ్రామానికి చెందిన కొయ్యడ కుమార్ ఆత్మహత్యకు పాల్పడగా గ్రామానికి చెందిన కొడి అనిల్ నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈమేరకు నేత్రదానం చేసేందుకు మృతుడి భార్య ముందుకు వచ్చారు. కరీంనగర్ ఎల్‌వీపీ టెక్నీషియన్ గాజుల సతీష్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైదరాబాద్ ఎల్‌విపి ఐ బ్యాంక్‌కు పంపారు. నేత్రదానం చేయటంపై మృతుడి భార్య, తల్లిదండ్రులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డాక్టర్ బీష్మాచారి, ముఖ్య సలహాదారులు నూక రమేష్ తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

శంకరపట్నం, జూలై 8: రోడ్డు ప్రమాదంలో గాయ పడిన ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన శంకరపట్నం మండలం కొత్తగట్టులో చోటు చేసుకుంది. కొత్తగట్టు గ్రామానికి చెందిన పల్లె రజిత (47) ఈ నెల 5న మధ్యాహ్నం పొలం పనులు ముగించుకొని భర్త మహేందర్‌రెడ్డి కోసం పెద్దగుట్ట దాబా హోటల్ ముందు నిలబడి ఉంది. ఈ క్రమంలో కరీంనగర్ వైపు నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఓ కారు ఢీకొట్టింది. రజిత తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

ఆర్టీసీలో భారీగా బదిలీలు

భగత్‌నగర్, జూలై 8: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో భారీగా బదిలీలు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. మెట్‌పల్లి డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న జి.వేదవతి హైదరాబాద్ పారుక్‌నగర్‌కు, వరంగల్-2 డిపో మేనేజర్ జి.సురేష్‌ను కరీంనగర్ బస్‌స్టేషన్ ఎటిఎంగా, కరీంనగర్ ఎటిఎం రజనీకృష్ణను లాఆఫీసర్ వరంగల్, గోదావరిఖనికి బదిలీ చేశారు. సిరిసిల్ల డిపో మేనేజర్ ఎస్.మనోహర్ కోరుట్లకు, కోరుట్ల డిపో మేనేజర్ విజయ మాధురి కరీంనగర్-1 డిపోకు, మంథని డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ జెబిఎస్ సిఆర్ఎంకు, కొత్తగూడెం అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ వివిఎస్‌కుమార్ పదోన్నతిపై మంథని డిపో మేనేజర్‌గా, హైదరాబాద్‌లో పనిచేస్తున్న బి.శ్రీనివాస్ వేములవాడ డిపో మేనేజర్‌గా, వేములవాడలో పనిచేస్తున్న డిపో మేనేజర్ మురళికృష్ణ గద్వాల్ డిపో మేనేజర్‌గా, మెహిదీపట్నం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎ ప్రకాశ్ రావును సిరిసిల్ల డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌ను హుజూరాబాద్‌కు, కరీంనగర్ కార్గో ఎటిఎం సదాశివ్‌ను కరీంనగర్ వర్క్‌షాపులోని టైర్స్ సెక్షన్‌లో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్‌గా, భద్రాచలం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న వి రామారావును కరీంనగర్ కార్గో ఎటిఎంగా బదిలీ చేస్తున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, జూలై 8: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దర్మారం ఎల్లమ్మగుడి సమీపంలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా విలాసాగర్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

మెట్‌పల్లి, జూలై, 8 : గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకునట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు. మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 6న మండలంలోని మేడిపల్లి శివారులో ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించాడు. అదే సమయంలో అనుమానా స్పదంగా కోరుట్ల పట్టణానికి చెందిన నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై అక్కడి వచ్చారు. పోలీసులను గమనించి ఇద్దరు యువకులు పారిపోగా కోరుట్ల పట్టణానికి చెందిన మరో ఇద్దరు మైనర్లను పట్టుకొని 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని విచారించారు. నలుగురు యువకులు మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహమ్మద్ అజార్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కోరుట్లకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. నాందేడ్‌లో గంజాయి అమ్ముతున్న మహమ్మద్ అజార్‌ను పట్టుకోవాలని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు ఆదేశాల మేరకు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి అజార్‌ను అదుపులోకి తీసుకుని సోమవారం తీసుకొచ్చారు. మైనర్లకు వైద్య పరీక్షలు చేయించి అనంతరం ముగ్గురిని కరీంనగర్‌లోని జువైనల్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. గంజాయి అమ్మిన, సరఫరా చేస్తున్న వారి వివరాలను పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం

కలెక్టర్ ఎదుట మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం

సుభాష్‌నగర్, జూలై 8: 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేసిన 11లక్షల రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరుతూ కలెక్టర్ పమేలా సత్పతి ఎదుట ఓ మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో కలెక్టర్ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించిన రామడుగు మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త జగన్‌మోహన్‌గౌడ్ ఆమె ముందే మెడకు చేతి రుమాలు చుట్టుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అక్కడ ఉన్న పోలీసులు ఆయనను అడ్డుకొని బయటకు తీసుకెళ్లారు. అనంతరం జగన్‌మోహన్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ చాలా కాలంగా తనకు రావలసిన బిల్లుల కోసం అధికారులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఇవ్వడం లేదన్నారు. రూ.11లక్షల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన చెందారు. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేకపోతున్నానని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తేనైనా నాకు న్యాయం జరుగుతుందని భావించానని అన్నారు. వారం క్రితం ప్రజావాణిలో కూడా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి తన గోడు వెల్లబోసుకున్నానని, ఇప్పటికీ డబ్బులు రాలేదని జగన్‌మోహన్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. మన ఊరు..మన బడి పథకంలో భాగంగా పాఠశాల అభివృద్ధి పనులు చేయించారని అన్నారు. ఈ పనులు తమకు సంబంధం లేదని, పాఠశాల అభివృద్ధి కమిటీ చేయాలని చెప్పినప్పటికీ గ్రామ కార్యదర్శి నుంచి కలెక్టర్ వరకు సర్పంచ్‌లపై తీవ్రమైన ఒత్తిడి చేశారని ఆరోపించారు. దీంతో తమ వద్ద డబ్బులు లేకపోవడంతో అప్పులు చేశామని, ఇంట్లో బంగారం, ఎకరాల భూమి అమ్ము కున్నామని వాపోయారు. అప్పులు ఇచ్చినవారు అప్పు తీర్చాలని తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, మంత్రుల చుట్టు తిరిగినా బిల్లులు మంజూరు చేయడం లేదన్నారు. విసిగి వేసారి చివరకు కలెక్టర్ ఎదుట ఆత్మహత్యకు యత్నించానన్నారు. జిల్లాలోని అనేక మంది మాజీ సర్పంచులకు, ఏఎంసీ డైరెక్టర్లు, సింగిల్ విండో చైర్మన్లు కూడా మన ఊరు..మన బడి అభివృద్ధి పనులు చేసి బిల్లుల కోసం పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు న్యాయం చేసి వెంటనే బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని జగన్‌మోహన్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.



జగన్‌మోహన్‌గౌడ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

'ప్రజావాణి'కి మందుడబ్బాతో వచ్చిన బాధితుడు

సుభాష్‌నగర్:అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా తన సమస్య పరిష్కారం కావడం లేదని ఓ బాధితుడు పురుగుల మందు డబ్బా తో ప్రజావాణికి వచ్చాడు. అయితే పోలీసుల తనిఖీలో ఆయన వద్ద పురుగుల మందు డబ్బా ఉందని గుర్తించి దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు ఒగ్గు రాజమల్లు మాట్లాడుతూ తాను గంగాధర మండలం, సర్వారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వాడనని, తనకు గ్రామంలో 58 సర్వే నంబ రులో 24 గుంటలు, 59 సర్వే నంబరులో 26 గుంటల భూమి, 447లో 22 గుంటల భూమి ఉందని తెలిపారు. 2005లో కొంత భూమిని తన తండ్రి నుంచి విరాసత్ ద్వారా పొందినట్లు చెప్పారు. ఆ భూమిని తానే సాగు చేస్తున్నానని తెలిపారు. అయితే ఈ భూమిని తాను కాని, తన కుటుంబ సభ్యులు కానీ ఎలాంటి క్రయ విక్రయాలు చేయలేదన్నారు. అయితే పట్టా భూమి పొరపాటున ఇతరుల పేరున ధరణి పోర్టల్‌లో నమోదు అయిందని తెలిపారు. దానిని సరి చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదన్నారు. ధరణిలో అక్ర మంగా తన భూమిపై ఉన్న ఇతరుల పేరును వెంటనే తొలగించాలని కోరారు. తమ సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం 1వ టౌన్ సీఐ సరిలాల్ రాజమల్లు దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం రాజమల్లు కలెక్టర్ పమేలా సత్పతికి దరఖాస్తు అందజేసి వెళ్లిపోయారు.



ఒగ్గు రాజమల్లు దంపతులు

కొనసాగుతున్న ఎన్టీపీసీ స్పోర్ట్స్ మీట్

జ్యోతినగర్, జులై 8 : రామగుండం ఎన్టీపీసీలో దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్ రెండోరోజు సోమవారం ఉత్సాహంగా కొనసాగింది. ఎన్టీపీసీ పీటీఎస్ స్పందన ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న బ్యాడ్మింటన్ పోటీలలో రెండో రోజు సింహాద్రి ఎన్టీపీసీ మహిళల జట్టు లీగ్ మ్యాచుల్లో విజయం సాధించింది. మహాత్మాగాంధీ స్టేడియంలో జరిగిన క్రికెట్ లీగ్ మ్యాచుల్లో ఎస్ఆర్‌హెచ్‌క్యూ(హైదరాబాద్) వల్లూర్ ప్రాజెక్టు జట్టుపై 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో సింహాద్రి ఎన్టీపీసీ జట్టు కుడిగి ఎన్టీపీసీ జట్టుపై 13 పరుగుల తేడాతో గెలుపొందింది. ఎన్టీపీసీ సదరన్ స్పోర్ట్స్ మీట్ బుధవారం ముగుస్తుంది.

వ్యవసాయ బావిలో మహిళ మృతదేహం

హత్య చేసి బావిలో పడేశారని అనుమానం

ముత్తారం, జూలై 8: ముత్తారం మండలంలోని వ్యవసాయ బావిలో ఓ మహిళ మృతదేహం కనిపించింది. గోనే సంచిలో మృతదేహం మూట కట్టి ఉండడంతో ఆమెను ఎవరో హత్య చేసి మూటగట్టి బావిలో పడేశారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఘటన మూడు రోజుల క్రితం జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మండలంలోని ముత్తారం నుంచి పారుపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో గల ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో సోమవారం మూట కట్టి ఉన్న గోనె సంచి నీళ్ల పైకి తేలి దుర్వాసన రావడంతో అటువైపుగా వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. తాడుతో కట్టి ఉన్న గోనసంచి మూటను పైకి తీయించి పరిశీలించగా అందులో ఒక మహిళ మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న మంథని సీఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకున్నారు. ఆ మృతదేహం ఎవరిది అనే విషయమై పోలీసులు ఇంకా గుర్తించలేదు. ఇటీవల ఒక మహిళ అదృశ్యం అయినట్లు గోదావరిఖని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో ఆ మహిళ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కానీ ఎవరూ గుర్తించలేకపోయారు. ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని మృతదేహం ఎవరిదని గుర్తించలేదన్నారు.

బీఎస్ఎన్ఎల్‌లో 4జీ సేవలు

భగత్‌నగర్, జూలై 8: ఉమ్మడి జిల్లాలో 4జీ సెల్ సైట్లను విజయవంతంగా ఏర్పాటు చేశామని కరీంనగర్ జిల్లా డిప్యూటి జనరల్ మేనేజర్ దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో స్వదేశీ పరిజ్ఞానంతో బీఎస్ఎన్ఎల్ 4జీ మొబైల్ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ప్రస్తుతం 2జి/3జి సిమ్‌లను 4జీ/5జీ సిమ్‌లకు అప్‌గ్రేడ్ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ మొబైల్ చార్జీలను పెంచే యోచన లేదన్నారు. బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్‌తో మెరుగైన ఇంటర్నెట్ సేవల అనుభూతి పొందాలని, ఆర్‌సి 249 అన్‌లిమిటెడ్ కాల్స్, 2జిబి డాటాను 45 రోజుల పాటు అందిస్తున్నామన్నారు.

విడుదల కాని 'అమ్మ ఆదర్శ పాఠశాల'ల బిల్లులు

● అప్పులు తెచ్చి పనులు చేసిన మహిళా సంఘాల సభ్యులు



గొల్లగూడెం పాఠశాలలో చేస్తున్న మరమ్మతు పనులు(ఫైల్)



ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో చేస్తున్న మరమ్మతు పనులు (ఫైల్)

సైదాపూర్, జూలై 8: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని భావించిన ప్రభుత్వం మరమ్మతు పనులను మహిళా సంఘాల ఆధ్వర్యంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనులు గుర్తించి అన్ని గ్రామాలలో ఆయా గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షురాళ్ల(వీవో)కు అప్పగించింది. మహిళలు ఎంతో ఉత్సాహంతో అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశారు. కానీ 25శాతం నిధులు మాత్రమే ఇప్పటి వరకు విడుదలయ్యాయని మహిళలు తెలుపుతున్నారు. ప్రభుత్వం త్వరగా నిధులు విడుదల చేస్తుందనే ఉద్దేశ్యంతో బంగారం తాకట్టుపెట్టి, అప్పులు తెలిచ్చి పనుల చేస్తే ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి అమ్మ ఆదర్శ పాఠశాల పనుల నిధులను వెంటనే విడుదల చేయాలని వీవోలు వేడుకుంటున్నారు. ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించి మరిన్ని పథకాలలో భాగస్వామ్యం చేయాలని, నిధుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలని కోరుతున్నారు.

అప్పులు తెచ్చి మరమ్మతు పనులు చేశాం

- రజిత, వీవో అధ్యక్షురాలు, సైదాపూర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అప్పులు తెచ్చి మరమ్మతు పనులు చేపట్టాం. పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 25శాతం నిధులు మాత్రమే విడుదలయ్యాయి. ఇంకా 75శాతం నిధులు విడుదల కాలేదు. నిధుల మంజూరుకు ఆలస్యం అయితే అప్పుల పాలయ్యే అవకాశ ముంది. ప్రభుత్వం త్వరితగతిన నిధులు మంజూరు చేయాలి.

భీవండి నుంచి జగిత్యాలకు మద్యం సరఫరా

- 11 మద్యం బాటిళ్లతో పాటు ద్విచక్ర వాహనం సీజ్
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ సీఐ



నిందితులను అరెస్టు చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

జగిత్యాల టౌన్, జూలై 8 :మహారాష్ట్రలోని భీవండి నుంచి జగిత్యాలకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురు వ్యక్తులను జగిత్యాల ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద 11 మద్యం బాటిళ్లతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. జగిత్యాల ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ పూర్తి వివరాలు వెల్లండించారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామానికి చెందిన నడిమెట్ల రాజు, కొడిమ్యాల అనీల్‌లు టాక్సీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల భీవండి ప్రాంతానికి టాక్సీ కిరాయి వెళ్లి అక్కడ ఇంపీరియల్ బ్లూ కంపెనీకి చెందిన 11 మద్యం బాటిళ్లను రూ. 300 చొప్పున కొనుగోలు చేశారు. వాటిని జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో కర్రీ పాయింట్ నిర్వహించే చంద్రమౌళికి రూ. 650 చొప్పున విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం కరీంనగర్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్, జగిత్యాల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ ఆదేశాల మేరకు సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు పొలాసలో ఉన్న కర్రీ పాయింట్‌పై దాడులు చేయగా 11 మద్యం బాటిళ్లు ఇతర ప్రాంతం నుంచి తీసుకవచ్చి విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ రాజమౌళి, ఎస్సై స్వప్న, సిబ్బంది గట్టయ్య, మోహన్ లాల్, చందు, కిషోర్, రమేష్, సంతోష్ ఉన్నారు.

రైతుల పక్షపాతి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి

●ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి.. ●జిల్లా వ్యాప్తంగా వైఎస్ఆర్ జయంతి



వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల టౌన్, జూలై 8: తెలంగాణ ప్రాంతం వట్టిపోకుండా ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి నదిపై ప్రాజెక్టులు నిర్మించేలా చర్యలు చేపట్టి రైతుల పక్షపాతిగా చెరగని ముద్ర వేసుకున్న వ్యక్తి రాజశేఖర్ రెడ్డి అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో సోమవారం మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి 75వ, జయంతి వేడుకలను పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరై వైఎస్సార్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీపీ సీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, టీపీసీసీ సభ్యుడు మాజీ మున్సిపల్ ఛైర్మన్ గిరి నాగభూషణం, మున్సిపల్ ఛైర్ పర్సన్ అడువాల జ్యోతి ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక నంది చౌక్ వద్ద నిర్వహించిన వేడుకల్లో భాగంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ పేద ప్రజల గుండెల్లో చిర స్థాయిలో నిలిచి పోయిన మహానీయుడు వైఎస్ఆర్ అన్నారు. టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు రాజేష్, మున్సిపల్ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల సుధాకర్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ప్రసాద్, మండల అధ్యక్షులు మొగిలి పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలోని జువ్వాడి భవన్‌లో సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం, ఎంబేరి నాగభూషణం, ఎంబేరి సత్యనారాయణ, కవిత, సోగ్రాబి ఉన్నారు.

మల్యాల: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మల్యాలలోని సోనియా గుడి వద్ద యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నేరెళ్ల సతీస్‌రెడ్డి, ఆదిరెడ్డి, వినయ్, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, మల్లేశం, వెంకటేష్, రాజారెడ్డి, ఇమామ్, అనిల్, ప్రశాంత్, తిరుపతి, జగదీశ్వర్, మారుతీ, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

పెగడపల్లి: మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను సోమవారం పెగడపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో గనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి , ఆయన ఉమ్మడి రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్, నాయకులు రాజు, మల్లారెడ్డి, విజయభాస్కర్, తిరుపతి, పాల్గొన్నారు.

రాయికల్: వైఎస్ఆర్ గొప్ప పరిపాలన దక్షకుడు అని, ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమం కోసం పరితపించిన వ్యక్తి అని కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు కొండపల్లి రవీందర్ రావు, మ్యాకల రమేష్ అన్నారు. రాయికల్ పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అలాగే మూటపెల్లి గ్రామంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొయ్యడి మహిపాల్‌రెడ్డి, ఎద్దండి దివాకర్‌రెడ్డి, భూమారెడ్డి, నర్సయ్య, చిన్న భూమయ్య, ఎండీ షంషీర్, రాజేష్, ఎండీ షాకీర్, శేఖర్, రవి, నరసింహారెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జువ్వాడి నర్సింగరావు



కోరుట్లలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్ : దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. సోమవారం మల్లాపూర్ మండల కేంద్రంలో వైఎస్ వైఎస్ఆర్ చిత్రపటా నికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు శ్రీనివాస్, మహమ్మద్ రఫీ, లక్ష్మారెడ్డి, సేవాదళ్ శ్రీనివాస్, రాకేష్, కొండయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మెట్‌పల్లి: వైఎస్ఆర్ జయంతి సందర్భంగా జువ్వాడి నర్సింగరావు, కొమిరెడ్డి కరంచంద్ పట్టణంలోని వేరువేరుగా వారి పార్టీ కార్యాలయాల్లో స్థానిక నాయకులతో కలిసి వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకుడు కొమిరెడ్డి విజయ్‌ఆజాద్, పార్టీ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, ఎర్రోళ్ల హన్మండ్లు, లింగారెడ్డి, సాయన్న, రాజేశ్వర్‌గౌడ్, లక్ష్మణ్, జాకీర్, సురభి అశోక్ పాల్గొన్నారు.

కథలాపూర్ : దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు కథలాపూర్‌లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వైఎస్ పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసినట్టు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో వైఎస్ చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భూషణరావుపేటలో విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, లింగంగౌడ్, ఆకుల సంతోష్, బాలె నీలకంఠం, మహేశ్ ఉన్నారు.

ఎస్సై ఆత్మహత్య కారకులపై చర్యలు తీసుకోవాలి

కోరుట్ల, జూలై 8 : భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన సీఐ, పోలీసులను కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ రాష్ట్ర నాయకుడు బలిజ రాజరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపి దోషులను వెంటనే సర్వీసు నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వడంతో పాటు భార్యకు ఉద్యోగం అందించాలన్నారు. ఈ సందర్భంగా నర్సయ్య, శోభన్, మురళి, సామ వేణుగోపాల్ ఉన్నారు.

మల్యాల: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండలంలోని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మల్యాల బ్లాక్ చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహం ముందు ఎస్సై ఆత్మహత్య పట్ల ఆందోళన చేశారు. మృతికి కారకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తొడేటి బాబు, చిన్నదుర్గయ్య, తిరుపతి, గుడిసె రవి, తిరుపతి, అనిల్, టైటస్, గణేష్, మిత్రి శ్రీనివాస్, నరేష్, గంగాధర్, గంగస్వామి పాల్గొన్నారు

బాలికలు, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ బృందం

రాయికల్, జూలై 8: మండలంలోని ఇటిక్యాల ఆదర్శ పాఠశాలలో సోమవారం షీ టీమ్ బృందం ఆధ్వర్యంలో బాలికల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలపై, బాలికలపై ఎవరైనా అసభ్యకరంగా, అసాంఘీకంగా ప్రవర్తించినట్లయితే పోలీస్ శాఖ ఊరుకోదని, వారిని శిక్షిస్తుందని తెలియజేశారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నేటి సమాజంలో మహిళలు, బాలికలు ఎక్కువగా తెలిసినవారితోనే వేధింపులకు గురవుతున్నారని, జాగ్రత్తగా ఉండాలి తప్ప అధైర్యపడవ్దని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. మహిళల పట్ల జరుగుతున్న దాడులను ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఏదైనా సమస్యలు ఎదురైతే షీ టీమ్ నెంబర్ 87126 70783ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఇన్‌చార్జి వలీ బేగ్, మహిళా కానిస్టేబుల్ సౌజన్య, పూజిత, పోలీస్ కళాబృందం సభ్యులు కమల్, గడ్డం రమేష్, హన్మంతు, ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా



రాఘవపేటలో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మల్లాపూర్, జూలై, 8 : ప్రజా సేవ చేయడానికే ఎమ్మెల్యేను అయ్యానని డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్థానిక నాయకులతో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, సమ స్యలు ఉంటే నేరుగా దృష్టికి తీసుకరావాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున ముంపు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన అందరికి కల్యాణలక్ష్మి పథకం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సంధిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపల్లి సరోజన-ఆదిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, దేవా మల్లన్న, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో మాజీ మంత్రి పూజలు



మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు శాలువా కప్పుతున్న ఆలయ ఈవో

ధర్మపురి, జూలై 8: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం సందర్శించారు. వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచారి ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు అందించారు. ఆయన వెంట డీసీఎంఎస్ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ రామయ్య, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రాజేష్‌కుమార్, సంగి శేఖర్, ఆలయ అసిస్టెంట్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

నూతన చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం

గొల్లపల్లి, జూలై 8 : నూతన చట్టాల వల్ల బాధితులకు సత్వర న్యాయం అందుతుందని ఎస్సై చిర్ర సతీష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గొల్లపల్లి మండలం మల్లన్న పేట గ్రామంలో ఈ నెల నుంచి అమలులోకి వచ్చిన కొత్త చట్టాల పై పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పౌరుల హక్కులను పరిరక్షించడం, రూల్ ఆఫ్ లాను నిలబట్టి క్రిమినల్ జస్టీస్ వ్యవస్థను సృష్టించడం, న్యాయం అందరికీ అందుబాటులో ఉండేలా చూడ్డంతో పాటు ప్రజలందరికీ సత్వర న్యాయం అందించడమే కొత్త చట్టాల అంతిమ లక్ష్యమని వివరించారు. సైబర్ నేరాలు, గంజాయి వల్ల ఏర్పడే అనర్థాలు, డయల్ 100, ట్రాఫిక్ నిబంధనల గూర్చి అవగాహన కల్పించారు. ఈ సదస్సులో తాజామాజీ ప్రజా ప్రతినిధులు సిద్దంకి మల్లయ్య, భేర కిషోర్, రాజన్న, నాయకులు సంతోష్, సత్తయ్య, మల్లయ్య, వెంకటి, చందు, సుధాకర్, పోచమల్లయ్య, మహేష్, స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం అదనపు బస్సు నడపాలి

మల్యాల, జూలై 8: నూకపల్లి మోడల్‌స్కూల్‌కు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందలాదిగా విద్యార్థులు వస్తుండడంతో ప్రస్తుతం ఉన్న ఒక బస్సు సౌకర్యంతో ఇబ్బందులు పడుతున్నారని అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మండల యువజన కాంగ్రెస్ నాయకులు సోమవారం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా బస్సు సౌకర్యం లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో అధికారులు సానుకులత వ్యక్తం చేసినట్లు నాయకులు తెలిపారు.

వినతిపత్రం ఇచ్చిన వారిలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నేరెళ్ల సతీష్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కోరెపు వెంకటేష్, కంటె అరుణ్ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



మొక్క నాటుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూలై 2: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని తుమ్మెనాల గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 75వ వన మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో మొక్కలు నాటి ట్రీ గార్డులు ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటితే పెరిగి పెద్ద వృక్షాలు మారి వర్షాలు విస్తారంగా కురిసి పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. నాటిన మొక్కను వదిలి పెట్టకుండా ప్రతి మొక్కను నీరు పోసి పెంచే బాధ్యతను తీసుకోవాలని ఆయన సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. నాటిన మొక్కలను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని ఆయన తెలిపారు. ఈజీఎస్ అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్, డీఎఫ్‌వో వేంకటేశ్వర్‌రావు, ధర్మపురి ఎస్ఎఫ్‌వో శ్రీనాథ్, మండల ప్రత్యేక అధికారి రాంచందర్, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో నరేష్‌కుమార్, ఈజీఎస్ ఏపీవో సృజన్, ఐకేపీ ఏపీఎం రమాదేవి, మాజీ ఎంపీటీసీ ఆకుబత్తిని తిరుపతి, మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుగ్గారం : ప్రజలు ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో లక్షల రూపాయలు ఖర్చు చేసి సీఎం రేవంత్‌రెడ్డి వన మహోత్సవం పేరిట చెట్టు నాటే కార్యక్రమాన్ని చేపట్టామని విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మద్దునూర్ గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలు నాటారు. విప్ అడ్లూరి మాట్లడుతూ జిల్లా వ్యాప్తంగా సుమరు46 లక్షల చెట్లను నాటాలని సంకల్పించామన్నారు. నాటిన మొక్కలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షుడు నర్సగౌడ్, నాయకులు అంజిత్ కుమార్, మాజీ సర్పంచ్ తిరుపతి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎండపల్లి: మండలంలోని అంబారిపేట గ్రామంలో సోమవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయాన్ని దర్శించుకొని ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కను నాటి, నీరు పోశారు. జిల్లా ఉపాధ్యక్షులు గుండేటి జితెందర్ రావు, మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి, అటవి శాఖ అధికారి పద్మవతి, విజయ్, శ్రీనివాస్, రమేష్, మల్లేశం గౌడ్ పాల్గొన్నారు.

జాతీయ స్ఫూర్తి సేవా రత్న అవార్డుకు ఎంపిక

కోరుట్ల, జూలై 8 : జాతీయ స్ఫూర్తి సేవా రత్న అవార్డుకు పట్టణానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు పేట భాస్కర్‌ను ఎంపిక చేస్తూ సంస్థ ఛైర్మన్ లయన్ ఆకుల రమేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్‌గా, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్‌గా వ్యవహరించి అనేక ప్రజా చైతన్య కార్య క్రమాలు నిర్వహించిన భాస్కర్‌కు అవార్డు లభించింది. రాజ్యాంగ రక్షణే లక్ష్యంగా జాతీయ స్థాయిలో అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించిందుకు గాను సోషల్ సర్వీస్ కేటగిరీలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూ నివర్శిటీ నుంచి డాక్టరేట్ ఈ మధ్యకాలంలో అందుకున్నాడు. సేవా రత్న అవార్డు ఈ నెల 13న హైదరాబాద్‌లోని సరస్వతీ పరిషత్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్లు ఛైర్మన్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఫొటోగ్రాఫర్‌కు ప్రశంసాపత్రం అందజేసిన కేంద్రమంత్రి

మల్యాల, జూలై 8: మల్యాలకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ మండలోజు శ్రీనివాస్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సోమవారం ఎక్సలెన్స్ హానర్, ప్రశాంసపత్రం అందజేశారు. కలకత్తాకు చెందిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ నిర్వహించిన ఆర్ట్ ఫొటోగ్రఫీలో ప్రతిభ కనబరచడంతో కేంద్రమంత్రి సంజయ్ చేతుల మీదుగా ప్రతిభ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను మంత్రితో పాటు పలువురు అభినందించారు.

ఉద్యమ గాన కోకిల అవార్డుకు రాజేందర్ ఎంపిక

ధర్మపురి, జూలై 8: ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన ప్రముఖ కళాకారుడు పలిగిరి రాజేందర్ ఉద్యమ గాన కోకిల అవార్డుకు ఎంపికయ్యాడు. తెలంగాణ పీపుల్స్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు మే కల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్ కుమార్ ఈ అవార్డు కోసం రాజేందర్‌ను ఎంపిక చేశారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఉమ్మడి పది జిల్లాల్లో రాజేందర్ ధూంధాం ద్వారా వందలాది ప్రదర్శనలు ఇచ్చి తన ఆట పాటతో ప్రజల్లో చైతన్యం రేకత్తించాడు. జాతీయ స్థాయిలో వేలాది ప్రదర్శనలు ఇచ్చిన గాయకుడు రాజేందర్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులు అందుకున్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో భాగంగా పది జిల్లాల వ్యాప్తంగా తన ఆట పాటలతో రాజేందర్ తెలంగాణ ఆవశ్యకతను తెలియజేశాడు. ఇందు కోసం ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ సంస్థ రాజేందర్ ప్ర తిభను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. రాజేందర్ ఈ నెల 12న కరీంనగర్ ప్రెస్ క్లబ్ వేదికగా ప్రముఖుల చేతుల మీదుగా అ అవార్డును స్వీకరిస్తారు. ఈ సందర్భంగా రాజేందర్‌ను పలువురు ప్రజా ప్రతినిధులు, కళాకారులు ప్రత్యేకంగా అభినందించారు.

రహదారులపై తిరుగుతున్న కేజ్‌వీల్ ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాలరూరల్, జూలై 8 : రహదారులపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడుపుతున్న యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇష్టానుసారంగా రహదారులపై నడపడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జగిత్యాల డివిజన్ అధ్యక్షుడు కాయితి శంకర్ ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్‌తో పాటు పరిసరప్రాంతాల్లోని గ్రామాల్లో రహదారులపై కేజ్ వీల్స్ నడపడం వల్ల రహదారులు చెడిపోయి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. చెడిపోయినరహదారులను తిరిగి బాగు చేయించడానికి కోట్ల రూపాయలు వెచ్చించడం వల్ల ప్రజాధనం వృధా అవుతుందన్నారు. వీటిని నియంత్రించే అధికారులు ట్రాక్టర్ యజమానులు ఇచ్చే ఆమ్యామ్యాలకు అల వాటుపడి ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే రహదారుల పై కేజీవీల్స్ నడిపే వారిపై కఠినచర్యలు తీసుకోని, రహదారులను కాపాడాలని కాయితి శంకర్ కోరారు.

అధికారుల సమన్వయానికి కలెక్టర్ కృషి చేయాలి

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



రోళ్లవాగు వద్ద రైతులతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

బీర్‌పూర్, జూలై 8: ఇరిగేషన్, అటవీశాఖల అధికారులతో కలెక్టర్ సమా వేశాన్ని ఏర్పాటు చేసి సమన్వయ పరచాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ఆధునీకరణ పనులను ఎమ్మెల్సీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన అటవీ భూములకు బదులు జిల్లాలో అందుబాటులో ఉన్న రెవెన్యూ భూములను ప్రత్యామ్నాయంగా చేస్తే నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. 0.25 టీఎంసీ ఉన్న ప్రాజెక్టు సామర్థ్యం 1 టీఎంసీకి పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టుకు గేటు అమర్చక పోతే వచ్చే నీరు నిలువ లేకుండా బయటకు వెళ్లిపోతాయన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఆర్‌డీవో, డీఎఫ్‌వో సంబంధిత జిల్లా సాగు నీటీ అధికారులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. రోళ్లవాగు ప్రాజెక్టులో ఆశించిన ఒక టీఎంసీ నీరు చేరే అవకాశం ఉంటుందని ఇందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ రమేష్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మన్ రావ్, మాజీ ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

రాయికల్ ఎస్సైగా అశోక్

రాయికల్, జూలై 8: రాయికల్ ఎస్సైగా టి. అశోక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్సై ఏసీబీ దాడి నేపథ్యంలో పరారీలో ఉండగా,ఎస్పీ ఆదేశాల మేరకు అశోక్ బాధ్యతలు చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

రాయికల్: మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామంలో వానాకాలం వరినాట్లను సోమవారం మండల వ్యవ సాయాధికారి మత్తయి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. 15 రోజుల నుంచి 30 రోజుల వయస్సు గల నారును నాటుకోవడం మంచిదన్నారు. రైతులు నల్ల పవన్ కుమార్, గోపి పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి తండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి సోమవారం ఆయనను పరామర్శించారు.

ఎండపల్లి: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని కిసాన్ మోర్చ అధ్యక్షుడు కొయ్యాడ రజినీకాంత్ అన్నారు. సోమవారం ఎండపల్లి తహసీల్దార్ రవికాంత్‌కి రైతు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు రావు హన్మంతరావు ఉన్నారు.

కోరుట్ల: కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు పన్ను రద్దు చేయాలని పెన్షనర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కోరుట్ల డివిజన్ నిర్వహించిన పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

కోరుట్ల: పట్టణంలో సోమవారం ఏబీవీపీ 76వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఏబీవీపీ నగర కార్యదర్శి మాడవేని సునీల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. ఎస్ఎఫ్ఎస్ విభాగ్ కన్వీనర్ మామిడిపల్లి పవన్, ప్రణయ్, నితీష్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని బండ లింగాపూర్‌లో ఇటీవల మృతి చెందిన గణేశ్, మరో మృతుడి కుటుంబాలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సోమవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ పోతుగంటి రాజేందర్, మాజీ ఉపసర్పంచ్ రాజాం, కందిరి ప్రతాప్‌రెడ్డి, ఇట్టేడి గంగారెడ్డిఉన్నారు.

మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు భూమేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ వీర్‌సింగ్‌కు పంటల బీమా సౌకర్యం కల్పించాలని వినతి పత్రం అందజేశారు. బీజేపీ నాయకులు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లి ఎస్సీ కాలనీలో ఫాతీమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బోర్‌వెల్ ఏర్పాటు చేయగా సోమవారం ప్రారంభించారు. కార్యక్ర మంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ సిస్టర్ ప్రీతా, మాజీ సర్పంచ్ లక్ష్మీ నారాయణ సంస్థ ప్రతినిధులు దీప్తి, వెలంగిని, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, రూప, స్రవంతి, మౌనిక పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలో సోమవారం ప్రారంభించిన శ్రీ బాలాజీ ప్రైవేటు ఆసుపత్రిని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ సందర్శించారు.

కొడిమ్యాల: మండలంలోని తిప్పయ్యపల్లి మాజీ సర్పంచ్ డేవిడ్ సోలోమోన్ గుండెపోటుకు గురికాగా బీఆర్ఎస్ మండల నాయకుడు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు పరామర్శించారు.

ఘనంగా గోరింటాకు వేడుకలు

కోరుట్ల, జూలై 8: పట్టణంలో వెలమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం గోరింటాకు వేడుకలు మహిళలు నిర్వహించారు. ఆషాడమాసం ఆరంభమైన నేపథ్యంలో ఒకరినొకరు గోరింటాకు పెట్టుకుని సంబరాలు జరుపుకున్నారు



గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు